# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 02 సెప్టెంబరు, 2024 | పేజీలు : 4


## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వివరాలు మెయిన్‌లో...

# సాగర్‌కు వరద పోటు



*** అదివారం కావటంతో పర్యాటకుల సందడి**

ప్రజాపక్షం/నందికొండః గత మూడు రోజులుగా ఎగువన ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతుంది. దీనితో ఇప్పట్లో కృష్ణ మ్మ శాంతించేలా కనిపించడం లేదు.ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీశైలం నుంచి భారీగా క్యూసెక్కుల వరద నీరు సాగర్ రిజర్వాయర్ కు ఇన్ ఫ్లోగా వచ్చి చేరుతుండంతో ప్రాజెక్ట్ మొత్తం 26 గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 525694 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేశారు . ఇంత భారీ వరద ప్రవాహం ప్రాజెక్టుకు రావటం అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేయడం ఈ సంవత్సరంలో ఇదే ప్రధమం.అయితే ఉదయం 10 గంటల నుండి 558400 క్యూసెక్కులుగా వస్తున్నటువంటి ఇన్ ఫ్లో సాయంత్రం 6 గంటలకు 462575 క్యూసెక్కులకు తగ్గింది.దీనితో ప్రాజెక్ట్ అధికారులు 22 గేట్లను 15 అడుగుల మేర, నాలుగు గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి ఇన్ఫ్లోగా వస్తున్న నీటి కంటే ఎక్కువగ 525414 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

*** రిజర్వాయర్ సమాచారం**

నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను 580 అడుగులు గా ఉండి, నీటి నిల్వ 312.0450 టీఎంసీలకు గాను 306.1010 గా ఉన్నది. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి 12180 క్యూసెక్కులు,కుడి కాలువ ద్వారా 5292 క్యూసెక్కులు,ఎస్ఎల్బీసీ ఏఎమ్ఆర్పి ద్వారా1800,క్యూసెక్కులు లోలెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఎడమ కాలువద్వారా ఎటువంటి నీటి విడుదలను కొనసాగించడం లేదు. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా 462575 క్యూసెక్కు ల నీరు వచ్చి చేరుతూ అవుట్ ఫ్లో గా 544686 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

*** పర్యాటకుల తాకిడి**

ఆదివారం సెలవు రోజు కావడంతో కృష్ణమ్మ అందాలను తిలకించడానికి నాగార్జునసాగర్ వద్ద పర్యాటకుల తాకిడి నెలకొంది. సాగర్ అందాలను తిలకించడానికి అధిక సంఖ్యలో పర్యాటకులు హిల్ కాలనీలో ఉ న్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

## నిండు కుండలా

# డిండి ప్రాజెక్టు..



**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం డిండి మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు రాష్ట్రంలో కురుస్తున్న ఎడ తెరపి లేని వర్షాల కారణంగా ఎగువన ఉన్న చెరువులు నిండి రఘుపతి వాగు, చింతపల్లి వాగు ద్వారా దుందుభి నది వెంట డిండి ప్రాజెక్టు లోకి భారీగా ఇన్‌ఫ్లో రావడంతో డిండి ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ఆదివారం భారీగా డిండి ప్రాజెక్టులోకి 19,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని, దాదాపు 30 ఫీట్లకు చేరువయినట్లు సంబంధిత అధికారుల సమాచారం . డిండి ఆయకట్టు రైతులు ఇప్పటికే పంటలు సాగు చేసుకున్న నేపథ్యంలో ప్రాజెక్టులోని నీరు డెడ్ స్టోరేజికి వెళ్లడంతో పంటలు ఎండిపోతాయేమోనని కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నింపాలని దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్‌ను రైతులు కోరగా ఎంఎల్‌ఏ, సిఎం, ఇరిగేషన్ శాఖ మంత్రులతో డిండిని నింపేందుకు చొరవ చూపగా ఎంఎల్‌ఏ రైతుల పక్షాన కృతజ్ఞతలు సైతం తెలిపారు. కాగా రాష్ట్రంలో భారీ వర్షా ల కారణంగా డిండి ప్రాజెక్టు నిండు కుండలా మారడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. రేపో మాపో డిండి డ్యాం దూకేందుకు సిద్ధమవుతుండగా పర్యాటకుల తాకిడి కొనసాగింది.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని టిజిఈజెఏసి నాయకులు అన్నారు. ఆదివారం సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టిజిఈజెఏసి సూర్యాపేట శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిజిఈజెఏసి నాయకులు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంతో దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఈజెఏసి జిల్లా చైర్మన్ ఎస్‌కె జాని మియా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి గోపి, జెఏసి నాయకులు దున్న శ్యామ్, చంద్రశేఖర్, రామలిగారెడ్డి, తంగేళ్ళ జితేందర్ రెడ్డి, సోంబాబు, పాండు నాయక్, వెంకటయ్య, వీరన్న, లింగయ్య, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, కిషన్ ప్రసాద్, జహంగీర్, లక్కపాక ప్రవీణ్, నరసింహా, ప్రసాద్, వెకన్న, సతీష్ పాల్గొన్నారు.

# నేడు విద్యా సంస్థలకు సెలవు



**ప్రజాపక్షం/యాదాద్రి :** భారీ నుండి అతి భారీ భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు 2వ తేదీ సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంత్ కే జెండగే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు విధిగా ఈ ఆదేశాలను పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్థలకు ముందస్తుగానే సోమవారం సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలెవరూ అత్యవసర పనులు ఉంటేనే తప్ప బయటకి రావద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం కారణంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిందని, దీనితో జిల్లా యంత్రాంగం పోలీస్, రెవిన్యూ, పంచాయతిరాజ్, మున్సిపల్, నీటిపారుదల శాఖ, విద్యుత్, ఆర్ అండ్ బి, వైద్య, ఆరోగ్య శాఖ వంటి కీలక అత్యవసర విభాగాలను అప్రమతం చేసి పరిస్థితులను జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర సమీక్ష జరుపుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మండల స్థాయిలో తాసిల్దారుల నేతృత్వంలో అన్ని విభాగాలు భారీ వర్ష పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రానున్న భారీ నుంచి అతి భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే మండల స్థాయిలో స్థానిక తాసిల్దారుని, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08685 293312 వినియోగించాలని జిల్లా కలెక్టర్ అట్టి ప్రకటనలో కోరారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా 6కు వాయిదా



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** నేడు(సోమవారం) జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని రెంజు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈనెల 6తేదీకు వాయిదా వేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, ప్టటణ, మండల కార్యదర్శులు ఈ మార్పును గమనించి 6న జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అంబేద్కర్ నగర్‌లో ఇండ్లలోకి వర్షపు నీరు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ఎడతెరపి లేకుండా రెండు రోజుల నుండి మండల వ్యాప్తంగా వర్షాలు కురవడం వలన మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో అంబేద్కర్ నగర్ కాలనీలో ఇండ్లలోకి వర్షపు నీరుతో పాటు డ్రైనేజి మురుగు నీరు రావడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డబుల్ బెడ్రూం కాలనీ నుండి అంబేద్కర్ నగర్‌కు డ్రైనేజి నీరు రావడం వలన దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజి సమస్యను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నపించిన స్పందన లేదని వాపోయారు. దోమలు, ఈగలు చేరి చిన్నా, పెద్దా లేకుండా అందరూ జ్వరాల పాలు అవుతున్నామని అన్నారు. డ్రైనేజి సరిగ్గా లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు తమ ఇండ్లలోకి వర్షపు నీరు వస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## మున్సిపల్ కార్మికులకు రైన్ కోట్స్ పంపిణీ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** రెండు రోజులుగా కురుస్తున్నా వర్షాల్లో సైతం రజలు సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికులకు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రవళికప్రకాష్ పెద్ద కుమారుడు ప్రీతం జోన వర్ధంతి సందర్భంగా రైన్ కోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చక్రహరి నాగరాజు, బిఆర్ఎస్ నాయకులు మోత్కురి సందీప్,యూత్ నాయకులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి మండలలోని చందుపట్ల గ్రామంలో కామునిగూడెం నర్సమ్మ(65) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. వారి కుటుంబ వారసులకు రూ.30 వేలు పిఎసిఎస్ సంఘం సభ్యుల డివిడెండ్ నిధి నుండి అధ్యక్షులు మందడి లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు బల్గూరి మధుసూధన్ రెడ్డి, సుబ్బురు మహేందర్, సీఈఓ దంతూరి నర్సింహ్మా, నల్లమాసు రాములు, ముస్కు నవీన్ కుమార్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## నాలాలపై అక్రమ నిర్మాణాలు
### చోద్యం చూస్తున్న అధికారులు





**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** భారీ వర్షాల నేపధ్యంలో జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికారులెవరూ కూడా సెలవులపై వెళ్లవద్దని అలర్ట్ చేశారు. పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాలను భేఖాతరు చేస్తున్నట్లు తెలుస్తుంది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పట్టణంలోని సబ్ జైల్ రోడ్డులోని నాలా ఉదృతంగా ప్రవహిస్తుంది. నాలాపై పలువురు చికెన్, మటన్ వ్యాపారస్తులు సముదాయాలను ఏర్పాటు చేసుకొని వ్యర్థాలను నాలాలోనే పడవేస్తున్నారు. దీని ఫలితంగా నాలా నీరు ప్రవహించకుండా సమీపంలోని ఉన్న ఇండ్లలోకి మురుగు కాల్వల ద్వారా చేరుతుంది. దీంతో తాము విష జ్వరాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా మున్సిపల్ అధికారులు నాలాపై ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఓ వ్యాపారి ఏకంగా నాలాలో ఇసు బస్తాలను వేసి అతడి షాపు వద్దకు నీరు చేరకుండా కట్టడి చేసుకోవడం విస్మయానికి గురి చేస్తుంది. ఈ విషయమై గత వారం మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్‌కు స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాపై ఉన్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## కాలువలను పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** మండలలోని పలు గ్రామాలలో కాలువలను ఎంపిడిఓ శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప ప్రయాణాలు చేయవద్దని చెప్పారు. చెర్వులు, వాగుల వద్దకు ఎవరు కూడా ఈత కొట్టడానికి వెళ్ళకూడదు, ఫిషింగ్ లాంటివి చేయకూడదన్నారు. పంచాయతీ కార్యదర్శులను గ్రామ పంచాయతీ స్థాయిలో ఒక అధికారిని అందుబాటులో ఉంచడం జరిగినది తెలిపారు. మండల స్థాయిలో పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారుల సమన్వయంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ దినకర్, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## కల్వర్టుల వద్ద కంప చెట్ల తొలగింపు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** విస్తారంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడం వలన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు దినం ఆదివారం రోజు కూడా ఎంపిడివో రాంరెడ్డి ప్రభుత్వ అధికారులతో కలిసి కొండమల్లేపల్లి, గుమ్మడవెల్లి, చిన్నఅడిశర్లపల్లి, గుడితండా, పెండ్లిపాకుల గ్రామాలలో పర్యటించారు. గుమ్మడవెల్లిలోని ఎంజిఆర్ కాలనీలో ఇండ్లలోకి చేరిన నీటిని జేసిబితో కాలువ తీయించి కుంటలోకి పంపించారు. చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపాన కల్వర్టుల వద్ద నీరు కుంటలోకి పోకుండా అడ్డంగా కంప చెట్లు మొలవడంతో వాటిని కూడా జేసిబితో తీయించి కుంటలోకి పంపించారు. ఈసందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పూరిగుడిసెలు, మిద్దె ఇండ్లు, పడావు పడ్డ ఇండ్లలో ఉండకూడదని వివిధ గ్రామాల ప్రజలకు సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టి ప్రజలు జ్వరాల బారిన పడకుండా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫర, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు, డ్రైనేజి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ తహశీల్దార్ ప్రశాంత్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి బొడ్డుపల్లి సైదులు, ఎంపివో నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శులు డాకునాయక్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జిట్టా కోలుకోవాలని అభిమానులు పాదయాత్ర



**ప్రజాపక్షం/భువనగిరి:** తెలంగాణ ఉద్యమ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జిట్టా బాలక్రిష్ణా రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని భువనగిరి ఎల్లమ్మ తల్లి దేవాలయం నుండి యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయం వరకు 200 వందల మందితో పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్ర ఎల్లమ్మ దేవాలయం నుంచి భువనగిరి పట్టణం మీదుగా పాత బస్టాండ్, సాయిబాబా దేవాలయం మీదుగా మాసుకుంట ఆంజనేయ స్వామి దేవాలయం నుండి యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వరకు నిర్వహించారు. జిట్టా బాలకృష్ణ రెడ్డి త్వరగా కోలుకోవాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో తోటకూరి వెంకటేష్ యాదవ్, బెల్లి చంద్రశేఖర్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ జనగాం పాండు, నీల ఓం ప్రకాష్ గౌడ్, ఏవి కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, చింతల లక్ష్మీ నారాయణ, సత్తిరెడ్డి, సోమవారం శంకర్, కస్తూరి పాండు, రత్నపురం శ్రీనివాస్, సిల్వేరు మధు పాల్గొన్నారు.

## చెస్ క్రీడలో విద్యార్థులు నైపుణ్యం సాధించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** చెస్ క్రీడల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండలంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్ 9,11, 15 బాల బాలికల చెస్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగంతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందన్నారు. చెక్ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, గండూరి శ్రీధర్, లింగారెడ్డి, మేడ సాయి కుమార్, అర్బిటల్ జానయ్య, భిక్షం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



**ప్రజాపక్షం/రామన్నపేట:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, మండల వైద్యాధికారి అశ్వినికుమార్ అన్నారు. శనివారం పదవీ విరమణ పొందిన మండలంలోని మునిపంపుల పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ ఆండమ్మకు విడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆండమ్మ అందరిని ఆప్యాయంగా పలకరించేదని, డ్యూటీ సమయంలో ప్రజలకు సేవే లక్ష్యంగా పనిచేసేందన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదన్నారు. కార్యక్రమంలో వసంతకుమారి, చంద్రకళ, గోపాలల్, వాణిశ్రీ, మల్లేష్, శ్రీనివాస్, కొండల్ రావు, చంద్రయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** పదవి విరమణ పొందిన ఓపిఎస్ ఉద్యోగుల బాధలు వర్ణణాతీతం అని, వెంటనే ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని టిజిఓ జిల్లా అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి కోరారు. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇజెఎసి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినం సందర్భంగా జెఎసి స్టీరింగ్ కమిటీ నిర్ణయానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా తహసీల్ ఆఫీస్ భువనగిరి వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎస్, యుపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం, యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, కొల్పుల రమేష్, అస్సోసియేట్ అధ్యక్షులు విజయ్, సభ్యులు నాల్గవ తరగతి ఉద్యోగులు, టిఎన్‌జిఓ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు భరత్, కార్యదర్శి ఖదీర్, జిఆర్‌టియు మండల అధ్యక్షులు మనోరంజన్ రెడ్డి, యుటిఎఫ్ మండల కార్యదర్శి వెంకటేష్, యాదాద్రి భువనగిరి జిల్లా పెన్షన్ సంఘము భాద్యులు, సోదర ఉద్యోగ సంఘ భాద్యులు పాల్గొన్నారు.

## త్రిపుర రాష్ట్ర వరద బాధితులకు రెడ్ క్రాస్ సహకారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** త్రిపుర రాష్ట్రం వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు రెడ్ క్రాస్ ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు జిష్ణు దేవ్ వర్మ పిలుపు మేరకు వివిధ జిల్లాల రెడ్ క్రాస్ సంస్థల సహకారంతో వెయ్యి కుటుంబాలకు సరిపడా నిత్యవసర వస్తువులు,బట్టలు వంట సామాగ్రి పంపే వాహనానికి ఆదివారం రాజ్ భవన్ లో గవర్నర్ చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా,గవర్నర్ సెక్రెటరీ,వైస్ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లు,నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి వివిధ జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో పొంగిపొర్లుతున్న కాలువ



**ప్రజాపక్షం/చందంపేట:** ఎడతెరపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చందంపేట మండలం ముర్పునూతల నుండి మన్నెవారిపల్లి వెళ్లే రోడ్డుపై నుండి డిండి కాలువ పొంగిపొర్లుతున్నందున అట్టి రోడ్డును చందంపేట ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో మూసివేయడం జరిగింది. కాలువ పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు, వాహనదారులు ఇక్కడ నుండి వెళ్లవద్దని ఎవరు ఇటు వైపు రావద్దని ఆయన సూచించారు. ఎవరు కాలువ వద్దకు రాకుండా బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### వర్షాలకు కొట్టుకుపోయిన పత్తి పంట

**ప్రజాపక్షం/చందంపేట:** రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చందంపేట మండలంలోని పలు గ్రామాలలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ఆదివారం చిత్రియాల గ్రామానికి చెందిన రైతు వంగూరు శ్రీనయ్య కవులు తీసుకొని పత్తి పంట వేసుకున్న తరుణంలో వర్షాలకు పత్తి పంట పూర్తిగా కొట్టుకుపోవడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు శ్రీనయ్య 8 ఎకరాలు కవులుకు తీసుకొని పత్తి పంట వేయగా జూన్, జూలై నెలలో వర్షాలు సరిగ్గ పడకపోవడంతో వేసిన పంటను మళ్లీ దున్ని పత్తి పంటను వేయడం జరిగింది. పత్తి పంట ఎదిగే సమయంలో భారీ వర్షాల వలన పత్తి పంట మొత్తం కొట్టుకుపోయిందని రైతు భావోద్వేగానికి లోనయ్యారు. తక్షణమే వ్యవసాయ అధికారులు స్పందించి వర్షాల వలన పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## కేజీబీవీలో వంట మనిషి కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ శాలిగౌరారం:** నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని తిరుమల రాయిని గూడెంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో వంట మనిషి కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల ఇన్చార్జి ఎంఈఓ మేక నాగయ్య తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై, ఎక్కువమందికి వంట చేయు అనుభవం కలిగి ఉన్నవారు ఈనెల 2, 3 తేదీలలో కేజీబీవీ ప్రాంగణంలోని స్పెషల్ అధికారికి (ఎస్ ఓ)దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు కొరకు రెండు పాస్ ఫోటోలు, ఆధార్ కార్డు, విద్యార్హతలతో దరఖాస్తు చేయాలని తెలిపారు. పూర్తి వివరాల కొరకు సంబంధిత స్పెషలాఫీసర్ను సంప్రదించాలని మండల విద్యాధికారి తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని నల్లగొండ జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి కస్తూర్బా గాంధీ బాలికల ఉపాధ్యాయులకు సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయన కస్తూర్బాగు పాఠశాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు వండించి భోజనాలను,స్కూల్ నీ పరిశీలించి విద్యార్థుల యొక్క యోగ క్షేమాలు, విద్యార్థులకు అందిస్తున్నటువంటి భోజనశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జాగ్రత్త పాటించాలని సూచించారు పాఠశాల ఇన్చార్జి,ఎస్ఓఎం వసంత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.ఆదివారం మునుగోడు మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడిన ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ లకు సంప్రదించాలని సూచించారు అనంతరం వాగులు వంకలను లోతట్టు ప్రాంతాలను పురాతన ఇండ్లను పరిశీలించారు.ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ నేలపట్ల నరేష్,ఆర్ఐ లు నాగరాజు, రామచంద్రయ్యలు ఉన్నారు.

## జాతీయ పాఠశాల అవార్డును అందుకున్న గౌతం గ్రూప్ ఆఫ్ స్కూల్స్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అత్యంత ప్రభావవంతమైన బోధన అభ్యాస పద్ధతులతో కూడిన పాఠశాల విభాగంలో 2024 సంవత్సరానికి జాతీయ పాఠశాల అవార్డును నల్లగొండ జిల్లా కు చెందిన గౌతం గ్రూప్ స్కూల్స్‌లో చైర్మన్ ఎన్ రమేష్ రెడ్డి అందుకున్నారు. ఆదివారం ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యోగేష్ సింగ్, ఎన్సిఈఆర్టి ఢిల్లీ ప్రొఫసర్ డాక్టర్ సవిత్రా కొత్వాని చేతుల మీదుగా బహుకరించారు. ఈసందర్భంగా అవార్డు అందుకున్న చైర్మన్ రమేష్ రెడ్డి మాట్లడుతూ జాతీయ అవార్డుతో తాము కొత్త మైలును అధిరోహిస్తున్నాం అన్నారు.భారతదేశంలోని 2500 పాఠశాలల్లో నల్లగొండ జిల్లా కేబదంలోని గౌతం గ్రూప్ స్కూల్స్‌లో మెజారిటీ విద్యావేత్తల మద్దతు లభించిందని గుర్తు చేశారు. అవార్డు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, పనిచేస్తున్న సిబ్బంది, తోపాటు తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కుండపోత వర్షానికి నీట మునిగిన నార్కట్‌పల్లి





*** శాపంలా మారిన పట్టణ రోడ్డు విస్తరణ**
*** విస్తరణను పట్టించుకోని పాలకులు, అధికారులు**

ప్రజాపక్షం /నార్కెట్ పల్లి :బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నార్కట్ పల్లి పట్టణం తడిసి ముద్దయింది. రెండు రోజుల నుండి వరుసగా కురుస్తున్న వర్షంతో పట్టణ నలు వీధుల్లో వరదల్ల కాలువలు సాగుతున్నాయి. డ్రైనేజీ మురికి కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఇప్పటికే మండల ప్రభుత్వ అధికారులు అప్రమత్తమై అత్యవసర సేవలకు 24 గంటల సదుపాయంతో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశారు.

*** రోడ్డు విస్తరడతో వ్యాపారస్తుల అవస్థలు**

నార్కెట్ పల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ లో భాగంగా చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమయింది. పట్టణం పొడవునా రోడ్డుకు ఇరువైపుల చేపట్టాల్సిన డ్రైనేజీ పనులను మధ్యలోనే ఆపేయడంతో మురికి నీరు వెళ్లడానికి సజావుగా లేకుండా పోవడంతో అట్టే మురికి నీరు దుకాణంలోకి, ఇళ్లలోకి చేరుతున్నాయి. దీంతో వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అనారోగ్య పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

*** తీరని కూడలి సమస్య**

నార్కెట్ పల్లిలో ప్రధాన కూడలి అయిన నల్లగొండ చౌరస్తా వద్ద రోడ్డు సమస్య రోజురోజుకు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురి చేస్తున్నది. పట్టణ విస్తరణలో భాగంగా చేపట్టిన రోడ్డు పనులు, అప్పటికే నార్కట్ పల్లి అద్దంకి రోడ్డు పనులు చేపట్టి ఉండడంతో రోడ్డు సమస్య ఎగుడు దిగుడుగా మారింది. దీనితో వాహనదారులు నానా అవస్థలు ఎదుర్కోవడమే కాకుండా, ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో వీరి బాధ వర్ణనాతీతం. నేటికీ డ్రైనేజ్ సమస్య తీరకపోవడంతో నల్లగొండ వైపు నుండి వచ్చే మురికి కాలువ ఆ ప్రధాన కూడలిలో చేరడంతో అక్కడ ఒక చిన్నపాటి నీటి కుంటలా ఏర్పడి, ఆ నీటి కుంట నుంచి ద్విచక్ర వాహనాలు బయటపడాలంటే నాన్న ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా వాహనాలను సైతం కరాబు చేసుకునే దుస్థితి నెలకొన్నది. ప్రధాన కూడలి చుట్టుప్రక్కన పరిసర ప్రాంతాలన్నీ జలమయమైపోతున్నవి. ఇట్టి దుస్థితి నార్కెట్ పల్లి పట్టణానికి శాపంలా మారిందని, ఇట్టి డ్రైనేజీ సమస్యను వీలైనంత తొందరగా తీర్చాల్సిందిగా వ్యాపారస్తులు ప్రభుత్వమును కోరుతున్నారు.

## నేడు కలెక్టరేట్ ముందు ధర్నాను విజయవంతం చేయాలి...



**ప్రజాపక్షం/గుండాల:** కేంద్ర ప్రభుత్వ పాలనలో పెరుగుతున్న నిత్యావసర ధరలకు వ్యతిరేకంగా నేడు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతులు రామచంద్రయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోయిన గత విధానాలే అవలంభిస్తుందని ఆరోపించారు. సంపన్న వర్గాలకే మేలు జరిగే విధంగా వ్యవహరిస్తు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలపై పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించలేకపోతున్నారని విమర్శించారు. ఇప్పటికే అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలు తగ్గించేందుకు సిపిఐ ఉద్యమాల ద్వారా బిజెపి ప్రభుత్వాన్ని ఎండ గట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## భారీ వర్షంతో అతలాకుతలం



**ప్రజాపక్షం/మోతె:** రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో మండలం అతలాకుతమైంది. పలు గ్రామాల్లోని చెరువు, కుంటలు నిండి అలుగులు పోయడంతో రోడ్లు కొట్టుకోపవడంతో పాటు ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని కూడలి, నామవరం, బుర్కచర్ల, సిరికొండ, రాంపురంతండా, రాయిపహడ్ గ్రామాల చెరువులు అలుగులు పోస్తున్నాయి. దీంతో పలు గ్రామల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంబాలు విరిపోయాయి. దీంతో పాటు భీక్యతండా, రాయికుంటతండ, కూడలి, రాంపురం, గోల్‌తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/రామన్నపేట:** అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున ఎవరూ బయటకు రావద్దన్నారు. గ్రామాల్లో పాత ఇండ్లు, గుడిసెలు, శిధిలావస్థలో ఉండే ప్రజలు మరింతగా అప్రమత్తంగా ఉండాలన్నారు. పెద్దలు తమ పిల్లలు వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాదులు ప్రబలకుండా జాగ్రత్తంగా ఉండాలనానరు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు విష సర్పాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కాలనీల్లో కరెంట్ స్తంబాలను తాకవద్దన్నారు.

## నక్కల వాగును పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండలంకేంద్రంలో నక్కల వాగు వరద ఉధృతిని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే జెండగే పరిశీలించారు. వరద ప్రవాహం తగ్గేంతవరకు రాకపోకలను నిలిపివేయాలని, నిరంతరం గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు, కమ్యూనిటీ హాళ్లకు తరలించాలని సూచించారు. లోతట్టు, ముంపు ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారివెంట తాసిల్దార్ శేషగిరి రావు, ఎంపీడీవో శంకరయ్య అధికారులు ఉన్నారు.

## అలుగు పోస్తున్న అడ్లూరు చెరువు



**ప్రజాపక్షం/శాలిగౌరారం:** గత మూడు రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు జలకలతో సంతరించుకున్నాయి. తద్వారా వానాకాలం పంటలకి నీటి సమస్యలు ఉండవని మండల పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అడ్లూరు గ్రామంలోని చెరువు అలుగు పోస్తున్న దృశ్యాన్ని చూడడానికి గ్రామ ప్రజలు బారులు తీరి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఇబ్రాహింపురంలో బోనాల పండుగ



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** శ్రావణమాసపు చివరి ఆదివారం సందర్భంగా తుర్కపల్లి మండలంలోని ఇబ్రాహింపురం గ్రామంలో ఘనంగా బోనాల పండుగ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామ దేవతలు పెద్దమ్మ తల్లి, పోచమ్మతల్లి, దుర్గమ్మ తల్లి, అమ్మవార్లకు దీప ధూప నైవేద్యాలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

## వనజీవి రామయ్య స్ఫూర్తితో విత్తనాల లక్ష్యం పూర్తి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** గాంధీనగర్ యువత ఆధ్వర్యంలో వనజీవి రామయ్య స్ఫూర్తితో వేసవిలో లక్ష విత్తనాలు సేకరించిన యువత ఆదివారం అవంతీపురం గుట్టపై సుమారు పదివేల నేరేడు, పొగడ, తురుక, వేప, చింత, క్యాషియోపెస్టులా విత్తనాలను చల్లడం పూర్తి చేయడం జరిగిందని ప్రకృతి ప్రేమికుడు ఎ.సందీప్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, రమేష్, సాయినాద్, రుహీద్, విష్ణు, సైదులు, రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈడి,ఎల్.ఎల్.బి పరీక్షలు వాయిదా

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** భారీ వర్షాల కారణాల దృష్ట్యా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో సోమవారం జరగాల్సిన ఎంఈడి,ఎల్.ఎల్.బి పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఉపేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన దృష్ట్యా సెప్టెంబర్ 2న జరగాల్సిన ఒక్క పరీక్షలు మాత్రమే వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మూడవ తేదీ నుండి పరీక్షలు యధాతథంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# చెరువుల ఆక్రమణలపై విచారించి నిర్మాణాలను తొలగించాలి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి, బీబీనగర్‌లలోని చెరువుల ఆక్రమణలపై విచారించి నిర్మాణాలను తొలగించాలి సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి పట్టణ, మండల సమితి సమావేశం బొమ్మాయిపల్లిలో కామ్రేడ్ చింతల పెంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన చెరువులు, కుంటలు ఆక్రమణలు జరిగినాయని చెప్పారు. సంబంధిత నీటిపారుదల శాఖ డిపార్టుమెంటు వారు ఏ చెరువు ఎన్ని ఎకరాలు ఉన్నదో రీసర్వే చేసి హద్దులు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని భువనగిరి అలాగే బీబీనగర్ చెరువుల పైన కూడా స్థానిక ప్రజలు ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టింపు లేదని అన్నారు. పట్టణాలలో నాళాలపై అక్రమ కట్టడాలను



నిరోధించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా హైదరాబాద్‌కే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి మరిపెల్లి రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, మండల కౌన్సిల్ సభ్యులు కోట శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

**ప్రజాపక్షం/వేములపల్లి:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.అంతేగాక వాగులు,డొంకలు నిండిపోయి కొన్ని గ్రామాల్లోని ప్రధాన రహదారులు నీటి ప్రవాహంతో మునిగిపోయి ప్రయాణాలకు అంతరాయం కలిగిస్తున్నాయి.మండలంలోని లక్ష్మీదేవి గూడెం శెట్టిపాలెం,తిమ్మారెడ్డి గూడెం, ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి దాంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. శెట్టిపాలెం వద్ద అద్దంకి నార్కెట్ పల్లి ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన మాల్లగడి కాఫీ సెంటర్ పూర్తిగా నీటితో నిండిపోయి వ్యాపారానికి అంతరాయం కలిగించింది, ఆయా గ్రామాల్లో నాట్లు వేసిన వ్యవసాయ పొలాల్లో నీరు నిండిపోయి పొలాలన్నీ ప్రవాహంగా మారిపోయాయి, ఈ విషయంపై సంబంధిత అధికారులు మాట్లాడుతూ మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షా ప్రభావం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు, వర్షాల కారణంగా పాత ఇంట్లో నివాసం ఉంటున్న మాతంగి దాస్ కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలిపారు.ప్రజలు చెరువులు ఉధృత వరద ప్రవాహం ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా కరెంటు స్తంభాలను ముట్టుకోకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు గత రాత్రి కురిసిన వర్షానికి అక్కడక్కడ చెట్లు విరిగిపడగా ప్రజలకు ఇబ్బంది కలగాకుండా వెంటనే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు




**ప్రజాపక్షం/దేవరకొండ:** ఆదివారం బొడ్డుపల్లి చెరువుకు మరమత్తులను చేసేందుకు సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. గతంలో మరమత్తుల కొరకు చెరువు తూములు తుప్పుబట్టి విరిగిపోయాయని, చెరువు కొత్త తూము బిగించాలని అధికారులను కోరగా ఆదివారం పరిశీలనకు వచ్చినట్లు పాత్లావత్ తండా మాజీ సర్పంచ్ వాంకుడావత్ రాజ్‌కుమార్ తెలిపారు. చెరువును పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ ప్రభు కళ్యాణ్ చెరువుకు సంబంధించి మరమ్మత్తులు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ కరుణసాగర్, ఏఈ నగేష్, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, పుల్లారావు, భాస్కర్, రెడ్య, హాతీరాం, చందు తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అతలాకుతలమైంది. మండలంలోని చింతలకుంట తండా గ్రామ పంచాయతీలో 8 ఇండ్లలో ఇండ్ల పైకప్పు నుండి వర్షపునీరు చేరడంతో ఆ కుటుంబాలను ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు ఎంపిడిఓ బి లాజర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ భీమ్ సింగ్, మాజీ సర్పంచ్ జాటోతు రవి, గ్రామస్తులు ఉన్నారు.

## రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గోవిందరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్రంలోని రా రైస్ మిల్లర్స్‌ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాడి గణపతి రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి రైతులకు వారధిగా ఉన్న ఈ వ్యవస్థను పాలకులు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అనంతరం రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొండమీది గోవింద రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద బకాయిలుగా ఉన్న మిల్లింగ్, కస్టోడియం, డ్రై ఏజ్, ట్రాన్స్‌ఫోర్ట్ చార్జీలను ప్రభుత్వం చెల్లించి మిల్లర్లను ఆదుకోవాలన్నారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన కోదాడ, తిరుమలగిరి, హుజూర్ నగర్, గరిడేపల్లి ప్రాతాల్లోని రా రైస్ మిల్లర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రా రైస్ మిల్లర్లు సుందరి నాగేశ్వర్ రావు, అనుప్ రెడ్డి, అర్వపల్లి సుధాకర్, నాగరాజు, గజ్జి వెంకటేశ్వర్లు, మట్టారెడ్డి, నర్సింహ్మారావు, పరమాత్ముల మధు, సైదులు, ఉపందర్, వట్టె గణేష్, మురళి పాల్గొన్నారు.

## ఎడమ కాలువలో కాలుజారిపడి మహిళా మృతి



**ప్రజాపక్షం/నిడమనూరు:** నాగార్జునసాగర్ ఎడమ కాలువలో కాలకుత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన మహిళ కాలు జారిపడి మృతి చెందిన సంఘటన ఆదివారం వేంపాడు సమీపంలో చోటు చేసుకుంది, నిడమనూరు ఎస్సై జె గోపాల్ రావు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడకు చెందిన జిల్లేపల్లి రాములమ్మ ( 61) గత ఆరు నెలల క్రితం వెంగన్నగూడెం గ్రామంలో తనను సాధుకుని పెంచి పెద్దచేసిన కటారి సత్తయ్య అనారోగ్యంతో ఉండడంతో సపరియాలు చేసేందుకు వచ్చిన రాములమ్మ ఆదివారం తిరిగి మిర్యాలగూడ వెళ్తుండగా వెంగన్నగూడెం స్టేజి సమీపంలోని వెంపాడు కాలువలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడినట్లు తెలిపారు, సమీపంలో కాలువలో చేపలు పడుతున్న వ్యక్తులు ఆమెను గమనించి కాపాడేందుకు కాలువలో నుండి బయటకు తీసేలోపే ఆమె మృతి చెందడం జరిగింది, మృతురాలి కుమారుడు జిల్లెపల్లి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థి ఉన్నత చదువు కోసం ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పట్టణానికి చెందిన ఎంబిబిఎస్ డాక్టర్ విద్యను భేతి జగదీష్‌కు కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ టిఆర్ ఫౌండేషన్ తరపున ఆదివారం విద్యార్థి ఉన్నత చదువులకు తోడ్పాటు అందించడం కోసం రూ.30 వేల ఆర్థిక సహాయం చేశారు. చేనేత మగ్గం నేస్తూ తమ పిల్లలు డాక్టర్లు ఇంజనీర్లుగా రాణించలేని పరిస్థితుల్లో కూడా విద్యార్థి తండ్రి మధు ఎన్నో కష్టాలకోర్చి తన కొడుకుని ఎంబిబిఎస్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో 200 ర్యాంక్ సాధించి కష్ట పడుతూ ఉండటం తన కొడుకును డాక్టర్‌గా చూడాలని కలలుగని సహకారం చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాకూడదని నిరూపించిన ఈ కుటుంబాన్ని అభినందించారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మోటకొండూరు:** మోటకొండూరు మండల మాజీ ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎలిమినేటి జంగారెడ్డి అత్తమ్మ, మామాలు ఇటీవల మరణించడంతో వారి దశదిన కర్మలో ఆలేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి నాయకులు యెల్లంల సంజీవరెడ్డి పాల్గొని వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కాటేపల్లిలో మాజీ ఉపసర్పంచ్ కొణితల మహేందర్ బాబాయ్ కొణితల లక్ష్మయ్య అనారోగ్యంతో మరణించడంతో లక్ష్మయ్య అంతిమ యాత్రలో పాల్గొని భౌతికకాయనికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తలు వివిధ గ్రామాలలో పాత గోడలు, శితిలావస్థలో ఉన్న ఇండ్ల నివాసులకు జాగ్రత్తగా ఉండాలని సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాలలో వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.